# మధుర జీవనం

వసంతరావు రామకృష్ణరావు



ఆరోజు ఆదివారం - శలవు కావడం చేత ఏమీ తోచటం లేదు - రేడియో విన్నాను- ఏదో యాంత్రికంగా వున్నది - టి.వి. చూసేను- అందులోను నాకు విసుగు, చిరాకు, చికాకు కలిగినందున, నాకు సరదాగా కాలక్షేపం చేసేందుకు అలవాటయిన పద్యం, కాస్త పైకి చదవటం మొదలుపెట్టాను.

"ఆమె నవనీత హృదయ, నా అంతరంగ శాంతి దేవత,
ఆశాపథాంతరాళ - పారిజాతమ్ము - ప్రేమజీవన
విభాత, కైశికీగీతి''............ సమయం ఉదయం

తొమ్మిదవుతోంది - నా ప్రక్కనే, చిక్కని కాఫీ కప్పుతో, చక్కని చిరునవ్వుతో, నిలబడి నవ్వుతున్నది, శ్రీమతి కామాక్షి!

టేబిల్ మీద కప్పు పెట్టి, నా కళ్ళల్లోకి కాస్త చిలిపిగా చూస్తూ అంది: "ఏమండీ-ఇంతకూ ఆ నవనీత హృదయ ఎవరు? ఆమె మీకు శాంతి దేవత అంటున్నారు! పారిజాతం అంటున్నారు, అన్నింటిని మించి ప్రేమ జీవన విభాతం అంటూ పాడి తన్మయులవుతున్నారు - ఇన్నాళ్లకు అంటే మన పెళ్లయిన పదేళ్ళకు, మీరు ఈ ఆదివారం ఆహ్లాదంగా, అమాయికంగా, అనురాగం చిలికిస్తూ ప్రేమగీతాలు పాడుకోవడం నాకు ఆశ్చర్యంగా వున్నది"

నేను చిన్న నవ్వు నవ్వి ఊరుకొన్నాను.

కాని, కామాక్షి ఈ విషయం చివరకు తేల్చే వరకు విడిచిపెట్టదని అనుభవంలోనే, నేను తెలిసికొన్న విషయం - అందుకు అలవాటుపడ్డాను కూడా! కామాక్షి, ఈసారి, కప్పు నా చేతికి అందిస్తూ, మనసులో అనుమానంతో స్పందిస్తూ, "ఇంతకూ, నేను అడిగిన దానికి మీరు జవాబుచెప్పరేం? మీరు, కవులనీ, భావుకులనీ, భావకవులనీ, (బావ) కవులనీ నాకు తెలిసే, మిమ్మల్ని పెళ్లి చేసికొన్నాను" అన్నది - ఇందులో 'బావ' అని అనడంలో, కామాక్షి నాకు మేనమామ కూతురునని, గుర్తు చేస్తున్నదని, గమనించి మరల చిన్న నవ్వు నవ్వి, కప్పు అందుకొని, సిప్ చేసేను.

కామాక్షి నా జవాబు కోసం చూస్తున్నదని నాకు తెలుసును. సైకాలజీ, చదివేను కనుక, ఆమె, మనసు వెనుకనే వున్న అనుమానతెరలు, దొంతరలుగా, నా కనుల ముందు దోబూచులాడుతున్నాయి. అందుకోసమే, నేను చిన్న నవ్వునే, నా పెద్ద ఆయుధంగా, చేసికొని ఉన్నాను కూడా! ఆమెకేసి సూటిగా చూస్తూ, "కామం! నీవు అనుకొంటున్నట్లు నాకు ప్రేమ వ్యవహారంలేదు" అన్నాను. కామాక్షికి చిరుకోపం వచ్చింది, వెంటనే "నన్ను కామం! అని పిలవవద్దని చెప్పేను

కదా!" అన్నది - అందులో, అసహనం కూడా ఉండటం గమనించి, నేను, "పోనీ! కామా అంటాను" అని అన్నాను,కాస్తగా పెంకెగా, ఆమె కేసి చూస్తూ! కామాక్షికి ఈసారి బాగా చిరాకు వేసింది కాబోలు - ఆవేదనతో, "అవును మరి! మీ జీవితంలో నేను కామానే, ఫుల్‌స్టాప్‌ను కాను - మీకు ఫుల్‌స్టాపు, స్టాపు మరో అమ్మాయితో!" అంది.

నన్ను మించి, పరిస్థితి విషమించినట్లు గమనించి చిన్నగా నవ్వి, "నీ చిరుదరహాసం కోసం, సరదా కోసం, అన్న ఆ పేరులను నీవు ఇంత సీరియస్‌గా తీసికొంటావు అనుకోలేదు - అయామ్‌సారీ! కామేశ్వరీ!" అని అన్నాను. నేను వేసిన పాచిక పారింది-" మీరు కామేశ్వరి అని పిలవండి - నేను ఈశ్వరిని - మీరు ఈశ్వరరావుగారే కదా! మన ఇద్దరికి ఆ దైవసంధానం చేసేడు-" అని అంటూ, ఎదురుగా ఉన్న లక్ష్మీదేవి పటంవైపు తిరిగి, దండంపెట్టి, తన కళ్లకు మాంగల్యాన్ని అద్దుకొని, నా ప్రక్కనే కూర్చొని, నా ముంగురులు సవరిస్తూ ఇలా అన్నది."ఇంత ఒత్తుగా, జుత్తూ, జులపాలూ బాగులేవండీ! ధరలు మండే ఈ రోజులలో హేరాయిల్ ఖర్చవుతుంది! సరిగా దువ్వకోక పోతే, అసహ్యంగా కనిపిస్తారు కూడా! ఇక పేలు పట్టుకున్నాయంటే, సరదాకి ముంగురులు ఎగిరేలాగ తల ఊపే మీరు, తల గోక్కుంటూ, గీక్కుంటూ ఉండాలి!" ఆమె మాటలు బట్టి, నేను ఎవరికీ అసహ్యంగా కనపడ కూడదని, నా భార్య ఆశిస్తోందని గ్రహించేను.

మొత్తానికి రాజకీయ నాయకుడిలాగ, నేను విషయాన్ని దారిమళ్ళించి కామేశ్వరి అడిగిన దానికి జవాబు చెప్పకుండా వున్నాను. దీని వలన, నా శక్తికి, నా యుక్తికి, నన్ను నేనే మనసులో, అభినందించుకొని, ఆనందించేను "వంటపని ఉంది - ఆదివారంకదా - చూడండి - ఇవాళ నేను చేసే స్వీట్సూ, స్పెషల్సూ, మీరు తప్పక మెచ్చుకొంటారు" అంటూ, కిచెన్‌కు పరుగుతీసింది!

స్నానం ముగించుకొని, హత్యావార్తలూ, హతాశుల ఆర్తులూ, చెలరేగుతున్న ధూర్తులూ, ఆశలేకపోయినా భావికోసం, స్ఫూర్తులూ, కీర్తులూ కోరే యువకుల బాధలూ ఉన్న "ఆదివారం" దినపత్రిక యాంత్రికంగా చదువు కొన్నాను. కవినీ, రచయితనీ కనుక సమాజం ఇలాగవుతూంది అని నిట్టూర్చేను. నిస్సహాయుడి గానే, నేను ఉండిపోయానే అని దిగులు చెందేను.

కామేశ్వరి రాకకోసం, ఆమె మాటలతో ఊరించిన వంటకాల కోసం, చూస్తున్నాను. ఆకలి వేస్తుంది. మనిషి జీవితంలో మధుర క్షణాలు ఉంటాయి-అయితే వాటిని మధురంగా, మార్దవంతో, మన్ననతో గుర్తించి, మనుగడ సాగించిన వాడే నిజమైన భాగ్యశాలి అని నా భావన.

డైనింగ్ టేబిల్ మీద, పదార్థాలతో వున్న పాత్రలను చక్కగా అందంగా అమర్చి, ఫ్రిజ్ వాటర్ తెచ్చి, ఊదొత్తులు వెలిగించి, ఆ సువాసనలో, ఆ మత్తులో, అమాయికంగా కామేశ్వరి, తాను కష్టపడి తయారుచేసిన వంటకాల, మాధుర్యం, నాకు రుచి చూపించి, "మధురం మధురం- జీవనం మధురం" అంటూ పాడుకొని, ఆనందిస్తుంది. ఆమె అందం నాది, ఆమె ఆనందం కూడా నాదే! "అందమైన వస్తువు ఎల్లప్పుడు, ఆనందదాయకం" అన్న ఆంగ్ల కవి మాటలు, గుర్తుకు తెచ్చుకొంటున్నాను. నాకు ఆలోచన ఒక హాబీ! ఎప్పుడూ, ఏదో ఆలో చిస్తూనే ఉంటాను-ఊహలపల్లకీలో ఊరేగుతూ ఉంటాను- ఈ పల్లకీకి బోయీలు ఉండరు- అయినా అది నా వాహనం- దాని కేనా ఆవాహనం, ఆహ్వానం కూడా! ఇద్దరం భోం చేస్తున్నాం-మా పెళ్లయి పది వసంతాలు

## నువ్వటు - నేనిటు

సంతోషంగా
అటు నువ్వూ లేవు
ఇటు నేనూ లేను
అయినా ఇద్దరం.
ఒకే గూటి గువ్వలం

మనల్ని చూసిన
అందరి నోట
ఒకే మాట
ముచ్చటైన జంట
చిలకా - గోరింకా
వాళ్లిచ్చిన ఈ కితాబు
మన నటనకు రివార్డు.

నీ తిరుగుళ్ళు
నా చేష్టలు
ఒకరికొకరికి తెలియంది కాదు
అయినా మనిద్దరం
గాంధీగారి కోతులం.

నీకు నేనంటే అసహ్యం
నాకు నువ్వంటే విహ్యం
అయినా ఇద్దరం
జోడెద్దులమై
బతుకు - బండిని లాగుతూనే వున్నాం.

నీ ఊహల - పల్లకిలో నేనూగలేను
నీ కోరికల విమానంలో నేనెగరలేను
నా చాదస్తపు భావాల లోగిలిలోకి
నువ్వు దిగి రాలేవు
అయినా
మన మనసుల రైలు పట్టాలపై
జీవనయానం సాగుతూనే వుంది.
చీటికి - మాటికి జరిగే కలతలు
మన మొహాల్ని
తూర్పు - పడమరలకు తిప్పుతాయి
అయితేనేం
ఇద్దరి చూపులూ ఆ భాస్కరుడిపైనే
ఒకరు సుప్రభాతం ఆలాపిస్తే
మరొకరు సంధ్యావందనం చేస్తారు.
అలా
మన దాంపత్య - జీవనం గతిస్తూనే వుంది

విడిపోవచ్చని మదిలో మెదిలినా
అలా చేయలేక పోవడం
అది నీ స్వార్థం
ఇది నా అవసరం.
ఎందుకో మరి
సంతోషంగా
అటు నువ్వూ లేవు
ఇటు నేనూ లేను.

-మహమ్మద్ తహసీన్ అలీ

గడిచినా, కామేశ్వరి నాకు క్రొత్తపెండ్లి కూతురిలా కనిపిస్తుంది! ఆమెలో నిత్య నూతనంగా కనిపించే శరీర సౌందర్యం, కవులు వర్ణించే దానికన్న ఎక్కువగా ఉంటుంది! అంతే కాదు– అమాయకు రాలు – తన మనసులో కలిగే భావాలను దాచి పెట్టుకోలేదు! ముఖ్యంగా నేనంటే తనకి ఎంతో ప్రేమ, ఎంతో గౌరవం, ఇంకా ఎంతో చనువు – అయినా నా మనసు కష్ట పెట్టటం ఆమెకు ఇష్టం లేదు – తనకు నచ్చని, తాను మెచ్చని, విషయం గూర్చి నాతో మాట్లాడినపుడు కూడా, ఒకనాడూ, ఆమె, తన హద్దు మీరి మాట్లాడ లేదు. విషయాన్ని నేను దారి మళ్ళించినా, ఆమె మాత్రం ఉద్రేకపడదు. నిదానమే ఆమె జీవన విధానం!

కొసరి కొసరి వడ్డిస్తూ, నాలోని కోర్కెలను రగిలిస్తూ,కామేశ్వరి పెట్టిన ఆనాటి భోజనంలోని మాధుర్యం, చాల రోజుల వరకు, మరిచిపోలేదు నేను! దానికి మరి ఒక కారణం కూడా ఉంది. ఉదయం జవాబు చెప్పకుండా నేను దాటవేసిన విషయం గురించి, కామేశ్వరి మళ్లీ అడిగింది గోముగా!

"ఏమండీ! ఆమె ఎవరండీ? నాకు చెప్పండి – నేను ఏమీ అనుకోనులెండి– మీరు కవులు కాబట్టి, మీరు ఒక అందమైన అమ్మాయిని గురించి వ్రాసి ఉంటారు అని సరిపెట్టు కొంటాను".

నేను, ఈసారి గట్టిగా నవ్వి, ఆమెకేసి చూసేను. "ఎందుకు నవ్వుతారు – చెప్పండి" అన్నది కామేశ్వరి. నేను, సరిపెట్టుకుంటాను అన్నావు ఉరిపెట్టుకొంటాను అని నీవు అనలేదని, నవ్వేను" ఎలాగైనా సరే, ఆమెకు ఈ విషయం చెప్పాలి అనిపించింది. అయినా ఆమెను ఆటపట్టించాలనే తలంపుతో, "ఇది నా పద్యం కాదు– ఒక కవివ్రాసినది" అన్నాను ముక్తసరిగా–

ఈ సమాధానంతో ఆమె తృప్తిపడలేదు. "అలాగయితే, మీరు ఒక్కరూ ఒంటరిగా ఈ పద్యం చదువుకొంటూ పరవశించడం దేనికి?" అని అన్నది నేను విషయం మళ్లించాలని, "కామేశ్వరీ!నీవు దీనిగురించి,ఇలా అనుమానించ డం, అపోహపడటం అనవసరం. "నేను, నిన్నే మనసారా ఇష్టపడి పెళ్లి చేసికొని హాయిగా ఉంటున్నాను" అన్నాను.

ఆమె వెంటనే "ఇష్టపడ్డారు కాని, నా మీద ప్రేమతో పెళ్లి చేసుకొనలేదన్నమాట" అన్నది. ఏమి చెప్పాలో తెలియక, ఆమెను టీజ్ చేయడం కోసం, "ప్రేమించడం అనేది అర్థం లేని మాట! నా ఉద్దేశ్యంలో, భార్యాభర్తల మధ్య ఉండవలసినది అనురాగం, కాని ప్రేమ కాదు. వధూవరులు,ఒకరి నొకరు చూసికొని, పరస్పరం ఇష్టపడతారు – తరువాత, పెళ్లి చేసికొని జంట అయి జీవితపు పంటలో గల మాధుర్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొని ఆనందిస్తారు" అని అన్నాను. ఈసారి కామేశ్వరి, "భార్యా భర్తల మధ్య ప్రేమ ఉండదా?" అని అన్నది. "ప్రేమంటే అది ఈనాడు తేలికయిన పదంగా మారి పోయింది– ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకొన్నారు అని పేపర్లో వేస్తారు. నిజానికి అది ప్రేమ కాదు – ఒకరిని ఒకరు శారీరకంగా, ఒక రకంగా కామదృష్టి కలిగి వున్నారని దాని అర్థం". కామేశ్వరితో "ఈ రాత్రి దీని గురించి వివరంగా చెపుతాను''అని అన దంతో ఆమె నవ్వింది!




ఇద్దరం ఆ రాత్రి చాలా సరదాగ గడ పాలని నిర్ణయించు కొన్నాం – కామేశ్వరికి ప్రేమ గురించి ఒక చిన్న లెక్చర్ ఇవ్వడం నాకిష్టం లేదు. ఆమె కొంత చదువుకొన్నది – కనుక– ఇలా ఆరంభించేను: "నీవు అంతగా అడుగు తున్నావు–కాబట్టి చెపుతున్నాను – నేను ప్రొద్దున్న చదువుకొని ఆనందించిన ఆ పద్యం వేదుల సత్యనారాయణశాస్త్రి గారి "ఆరాధన" లోనిది. అందులో వారు అన్నది విను. "చెలియ! ఏ దేవి మంగళాశీస్సుమములు, పరిమళించి నవో, మన శిరములందు,...నేటికి లభించె నిరువురి, మనోరథమ్ము లకే కఫలము".

కామేశ్వరిని ఈ విధంగా సంతృప్తి పరచి, తర్వాత ఇలా అన్నాను "ఈ రోజు మన పెండ్లి రోజు! అందుచేత, ఆ మహనీయుని పద్యము, అందంగా ఉన్నందున చదువుకొని,ఆనందించెను నీవు నా చెలివి. మన ఇద్దరి మనోరథములకు ఒకటే ఫలము!అది ఏమిటి? చెప్పుకోచూద్దాం".

కామేశ్వరి సిగ్గుపడింది – మాట్లాడలేదు. నా ప్రక్కనే, ప్రక్క మీద పరుండిన ఆమె క్రొత్తపెళ్లి కూతురు లాగ కళ్లు చేతులతో కప్పుకొని, చేతివ్రేళ్ల సందు గుండా, నావైపే చూస్తున్నది! అవి చాల మధురమైన క్షణాలు–వాటిని వర్ణించడం నాకు చేతకాదు. ఆరాత్రి మా ఇరువురి గాఢా శ్లేష పరిష్వంగ సుఖం మాటలతో చెప్పడం సాధ్యం కాదు. సాధారణంగా, తాను వివాహం చేసి కొనిన భర్త, మరి ఒక స్త్రీతో సంబంధం కలిగి వుండటం ఏ భార్యకూ ఇష్టం వుండదు. దాని మూలంగా, ఆమె మనసులో వేదన కలుగు తుంది. దాంపత్యసుఖం దూరం అవు తుంది. భార్యా భర్తలు ఒకరికొకరు చేరువ కారు – దూరమవుతారు – వారి జీవితాలు భార మవుతాయి–. ఆనాటి ఉదయం నేను చదివిన పద్యం అపోహ కలిగించినా, మా ఇద్దరి మధ్యా అలజడి కలిగించలేదు– అలల మాదిరిగా, కలలు మాదిరిగా, మా సంభాషణలు మిగిలి పోయాయి.

ఆ మర్నాడుదయం లేస్తూ, నేను ఆమెతో "నీవు నిన్న టీ కప్పులో తుపాను లేపేవు కదా!" అన్నాను. అందుకామె "కాఫీ కప్పులో తుపాను రాదంటారా?" అంది ఆమెకు ఏం జవాబు చెప్పాలో తెలియలేదు" ఉండండి! కాఫీ తెస్తాను" అంది కామేశ్వరి నా చేయి విడిపించు కొంటూ!